సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ౹ 14 ౹ డిసెంబర్ ౹ 2023



వికసించిన జర్బరా
చింతపల్లి రూరల్: స్థానిక పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన జర్బరా పూల సాగు విజయవంతమైంది.



కాఫీ పండ్ల సేకరణ లక్ష్య సాధనకు కృషి
కాఫీ పండ్ల సేకరణ లక్ష్య సాధనకు కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు.

IIలో



వాతావరణమిలా..
సాక్షి, పాడేరు: చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో 14.7 మినుములూరులో 12, అరకులో 14.5, డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

నేడు సీఎం ట్రాన్సిట్ హాల్ట్



మహారాణిపేట: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గురువారం విశాఖ రానున్నారు. ఆయన గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి 9.30 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి బయలుదేరుతారు. తిరిగి మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

పంట నష్టం పరిశీలన



వరి పనలను పరిశీలిస్తున్న నందు

జి.మాడుగుల: మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు పర్యటించారు. వంతాల పంచాయతీలో వంతాల, గంటరాయి తదితర గ్రామాల్లో వరి పంటను, ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. గిరిజన రైతుల నుంచి పంట నష్టం వివరాలను ఆయన తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ఎల్.పాత్రుడు, మండల జేసీఎస్ కన్వీనర్ ఎల్.కల్యాణం, అగ్రికల్చర్ అసిస్టెంట్ మాణిక్యాలరావు, కామేశ్వరి, ప్రతాప్‌కుమార్, సతీష్, మాజీ సర్పంచ్ కొండమ్మ పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో స్పందన

సాక్షి,పాడేరు: గత వారం వాయిదా పడిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని గురువారం పాడేరు ఐటీడీఏలో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేయాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నిశాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా సంతోష్


వాసుపల్లి సంతోష్



జీలకర్ర నాగేంద్ర


జీవీవీ భూషణం


మాతే వెంకటరమణ

దొండపర్తి(విశాఖ): రాష్ట్ర విద్యార్థి విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా వాసుపల్లి సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీలో విశాఖకు చెందిన నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. జోనల్ ఇన్‌చార్జ్‌గా(విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా) జానకీ రామ్ రెల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.నాగేంద్రరావు, సంయుక్త కార్యదర్శిగా బి.నిషాకుమార్ నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన జి.వి.వి.భూషణం రాష్ట్ర కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా మాతే వెంకటరమణ నియమితులయ్యారు.

ప్రభుత్వ ఆశయానికి తగ్గట్టుగా సేవలు



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

అడ్డతీగల: అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు సమర్థవంతంగా అందించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని బాపట్ల ఎంప్లాయిస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సూచించారు. వైటీసీలో జరుగుతున్న గ్రామసచివాలయ ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.బాపన్నదొర, ఈవోపీఆర్డీ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

లాభాల రాజ్‌మా

- తగ్గిన దిగుబడి
- మార్కెట్లో మంచి ధర
- సీజన్ ప్రారంభంలో కిలో రూ.80కు కొనుగోలు
- గిరి రైతుల్లో ఆనందం



రాజ్‌మా పైరు (ఇన్‌సెట్) రాజ్‌మా గింజలు

సాక్షి,పాడేరు: రాజ్‌మా చిక్కుడు గింజలకు మార్కెట్లో డిమాండ్ ఉన్నందున గిరి రైతులకు మంచి ఆదాయం పొందే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి తగ్గింది. దీనివల్ల డిమాండ్ నెలకొనడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.80 చొప్పున మంగళవారం జి.మాడుగుల వారపుసంతలో బుధవారం చింతపల్లి, కించుమండ సంతల్లో గిరి రైతులకు ధర లభించింది.

జీసీసీ ఆధ్వర్యంలో..

గిరిజన సహకార సంస్థ కూడా వచ్చేవారం నుంచి రాజ్‌మా గింజలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది కిలో రూ.75 చొప్పున కొనుగోలు చేసింది. ఈఏడాది ధర పెంచే యోచనలో జీసీసీ ఉంది. ప్రైవేట్ వ్యాపారులతో పాటు జీసీసీ కూడా రాజ్‌మా గింజల కొనుగోలుపై దృష్టి పెట్టడంతో ధర పెరిగే అవకాశం ఉందని గిరి రైతులు ఆశిస్తున్నారు.

పాడేరు డివిజన్‌లో మాత్రమే..

పాడేరు డివిజన్‌లో మాత్రమే రాజ్‌మా సాగుకు అనుకూలం. ప్రభుత్వం ఈ ఏడాది 4,546 క్వింటాళ్ల విత్తనాలు 90శాతం రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేసింది. పోడు, మెట్ట భూముల్లో రైతులు సాగు చేపట్టారు. ఎకరాకు 20 కిలోల విత్తనం అవసరం కాగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే దిగుబడి 200 నుంచి 250 కిలోల వరకు వచ్చే అవకాశం ఉంది.

నష్టపరిచిన తుపాను వర్షాలు

ప్రతికూల వాతావరణ పరిస్థితులు కారణంగా ఈ ఏడాది రాజ్‌మా దిగుబడులు తగ్గాయి. పంట పిందె దశలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల పైరు ఎదుగుదల లోపించింది. వాతావరణ పరిస్థితులు అనుకూలతను బట్టి ఈ ఏడాది సకాలంలో సాగు చేపట్టలేకపోయారు. ఆలస్యంగా వేసిన పైరు తుపాను వర్షాలకు దెబ్బతింది. పైరు ముంపునకు గురికావడంతో గింజలు మొలకెత్తాయి. కొన్ని చోట్ల రంగు మారాయి. దీనివల్ల 4వేల హెక్టార్ల పంట నష్టం వాటిల్లినట్టుగా అధికారులు చెబుతున్నారు.

ధర పెంపునకు నివేదిక



రాజ్‌మా దిగుబడులు బాగా తగ్గాయి. వర్షాలకు గింజలకు ఏర్పడిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని గిట్టుబాటు ధర చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది కన్నా కొనుగోలు ధర పెంచాలని జీసీసీ యాజమాన్యానికి నివేదిక పంపాం. ధర నిర్ణయించిన వెంటనే వారపు సంతలు, గ్రామాల్లో కొనుగోళ్లు మొదలుపెడతాం.

– డి.సింహాచలం, జీసీసీ డీఎం, పాడేరు

మెరుగైన సేవలు అందించండి

ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మురళి



మాట్లాడుతున్న డైరెక్టర్ మురళి

అనంతగిరి: సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. మండలంలోని కొత్తవలస ఆశ్రమ పాఠశాలలో 21 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు నిర్వ హించిన శిక్షణ తరగతులను బుధవారం ఆయన సందర్శించారు. విధుల నిర్వహణ, క్రమశిక్షణ, నాయక త్వ లక్షణాలు, ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలనే అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఒత్తిడిని జయిస్తే విజయం సాధించవచ్చన్నారు. ఎంపీడీవో శ్రీహర్షిత్, ఏవో లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ శిబిరం సందర్శన

డుంబ్రిగుడ: గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అందిస్తున్న శిక్షణను బుధవారం ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళి సందర్శించారు.ఎంపీడీవో ఉషారాణి పాల్గొన్నారు.

ఉప్మాకు బదులు ఎగ్ ఫ్రైడ్‌రైస్

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆదేశం
- వేరుశనగ చిక్కీలు గడువు తీరడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం



ఫోన్లో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి

చింతూరు: విద్యార్థులకు అల్పాహారంలో ఉప్మాకు బదులు ఎగ్ ఫ్రైడ్‌రైస్ ఇవ్వాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చక్కగా విద్యనభ్యసించి మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. పదో తరగతిలో గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు అందించే వేరుశనగ చిక్కీలు బుధవారంతో గడువు ముగియడాన్ని గుర్తించిన ఆయన సంబంధిత కాంట్రాక్టరుపై ఫోన్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిస్థానంలో గడువు కలిగిన చిక్కీలను సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో కంచర్ల సుజాత, ఎంఈవో–2 గుండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు రాజవొమ్మంగిలో వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- సంక్షేమ పథకాలు వివరించేందుకు నిర్వహణ



వాతంగి గ్రామంలో సెల్ టవర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలో గురువారం జరిగే వాహన యాత్రలో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం మండలంలోని వాతంగి గ్రామానికి వచ్చిన వారు ఎయిర్‌టెల్ సెల్ టవర్‌ను ప్రారంభించారు. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని వట్టిగెడ్డ గ్రామం నుంచి ఈ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. రాజవొమ్మంగి, కొండపల్లి, శరభవరం మీదుగా సాయంత్రం నాలుగు గంటలను లబ్బర్తి చేరుకుంటుందన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మండలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వాతంగి సర్పంచ్ భీంరెడ్డి శుభలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, నాయకులు జుర్రా జాన్‌బాబు, కొంగర మురళీకృష్ణ, అడపా కామేష్, దాసరి నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో మెగా జాబ్‌మేళా రేపు



జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళాలో లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ, అపోలో ఫార్మసి, కేర్ ఫర్ యూ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మోహన్ స్పిన్టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పైఎస్‌కే ఇన్ఫోటెక్, ఈకాం ఎక్స్‌ప్రెస్, నవతా రోడ్ ట్రాన్స్‌ఫోర్స్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వేతనం చెల్లిస్తారన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు, ఐటీఐ నుంచి డిప్లొమో, ఇంజనీరింగ్ చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు. వివరాలకు 0401786463, 9308338105 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎస్‌డీవో జి. ప్రశాంత్, ప్రతినిధి నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులూ చక్కగా చదువుకోండి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



సీతాపురం హైస్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

కూనవరం: విద్యార్థులు మంచిగా చదవండి.. క్రమం తప్పకుండా పాఠశాలకు రండి! ఇక్కడే భోంచేయండి... ఉపాధ్యాయులు చెప్పింది నేర్చుకోండి... తల్లిదండ్రుల మాట వినండి అంటూ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి హితవు పలికారు. మండలంలోని మర్రిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. రేపాక ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. జగనన్న కిట్లు అందాయా లేదా అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన వర్కర్లనుంచి మెనూ వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున మంచిగా చదువుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ , అధ్యాత్మిక పుస్తకాలను అందజేశారు. పోచవరం కాలనీలో చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు.డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఎంఈఓ–2 లక్ష్మయ్య, హెచ్‌ఎం ఎస్ వెంకట్రావు పాల్గొన్నారు.

ఎటపాక: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా చదువుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలో ఆయన పర్యటించారు. దీనిలో భాగంగా కేజీబీవీ, ఎన్టీఆర్ కాలనీ, సీతాపురం హైస్కూల్, చోడవరం, పురుషోత్తపట్టణం రేషన్ దుకాణాలు, అవేర్ కాలనీ, గోగుబాక అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నెట్‌వర్క్ సమస్య పరిష్కారం అయినందున ఇకపై రేషన్ సరకుల సరఫరాకు ఆఫ్‌లైన్‌తో పనిలేదని, ఆన్‌లైన్ ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. సీతాపురం స్కూల్లో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ బడులను తీర్చిదిద్ది మెరుగైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంగా మంచి పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన దుస్తులు, పుస్తకాలు అందించి అమ్మ ఒడి వంటి ఉపయోగకర పథకాలను అమలు చేస్తోందన్నారు. మంచిగా చదువుకుని ప్రభుత్వ బడులకు, కుటుంబ సభ్యులకు మంచి పేరు తేవాలని చెప్పారు. ఆయన వెంట ఎంఈవో సరియం రాజులు, ఏఎస్‌డబ్ల్యూవో సుజాత, అంగన్‌వాడీ సీడీపీవోలు, సివిల్‌సప్లయ్ అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు




వీఆర్‌పురం హైస్కూల్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

వీఆర్‌పురం: విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ అమలుతీరును తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో పాఠశాలలను నాడు–నేడు పథకంలో ఆధునికీకరించిందన్నారు. ప్రభుత్వ ఆశయానికి తగ్గట్టుగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. టెన్త్ పరీక్షల్లో 500కు పైబడి మార్కులు సాధించాలని కోరారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను ఆయన విద్యార్థులకు అందజేశారు. సోములగూడెం ఆశ్రమ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంఈవో వీవీ లక్ష్మీనారాయణ హెచ్‌ఎం సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో కూరుకుపోయి ఆశ్రమ విద్యార్థి మృతి

- స్నానం చేస్తుండగా ప్రమాదం
- మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు



విద్యార్థి కూరుకుపోయిన బొడుబొడ గెడ్డ



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి సంతోష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



విద్యార్థి సంతోష్ మృతదేహం

డుంబ్రిగుడ: గెడ్డలో స్నానానికి దిగిన ఆశ్రమ విద్యార్థి కూరుకుపోయి మృతి చెందిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని గుంటసీమ పంచాయతీ జోగిపుట్టు గ్రామానికి చెందిన బుర్ది సంతోష్ (12) స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి భల్లుగుడ వద్ద బొడబొడ గెడ్డ వద్దకు వెళ్లారు. సంతోష్ వారితో కలిసి గెడ్డలోకి స్నానానికి దిగాడు. లోతులో కూరుకుపోయాడు. మిగతా వారంతా ఆశ్రమ పాఠశాలకు వచ్చేశారు. ఈ విషయాన్ని వారు గోప్యంగా ఉంచారు. ఈ నేపథ్యంలో గెడ్డలో తేలిన విద్యార్థి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. పంచాయతీ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థి వద్ద ఆధారాలను బట్టి ఆశ్రమ విద్యార్థిగా గుర్తించారు. వెంటనే జోగిపుట్టులో ఉన్న విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని ఆశ్రమ పాఠశాలకు తీసుకువచ్చి ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని అరకు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

హెచ్‌ఎం అర్జున్ వివరణ

విద్యార్థి బయటకు వెళ్లిన విషయం తమకు తెలియదనిగిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అర్జున్ వివరణ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తాను విధులు ముగించుకుని వెళ్లిపోయినట్టు చెప్పారు. విద్యార్థుల అటెండెన్సు తీసుకోవాలని వార్డెన్ రామును ఆదేశించినట్టు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి తమ ఆశ్రమ విద్యార్థిగా గుర్తించామన్నారు. వెంటనే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశామని చెప్పారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ: ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

సాక్షి, పాడేరు: డుంబ్రిగుడ ఆశ్రమ పాఠశాల విద్యార్థి గెడ్డలో పడి మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నామని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు తెలిపారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఎప్పుడు, ఎలా బయటకు వెళ్లారనే సమాచారం సేకరిస్తున్నామన్నారు. మంగళవారం రాత్రి భోజన సమయంలో వార్డెన్ హాజరు వేసింది లేనిది కూడా పరిశీలిస్తామని చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రతీ పంటకు మద్దతు ధర



ధాన్యం బస్తా బరువును తూస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జేసీ శివ శ్రీనివాస్, పార్టీ నేతలు



కొనుగోలు కేంద్రం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- సింగవరం ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొయ్యూరు: ప్రతీ పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె సింగవరం రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ శివ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో మూడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర విషయంలో భరోసా ఇవ్వలేదన్నారు. రైతులు పండించిన ప్రతీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దళారి వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. అందుకు తగ్గట్టుగా రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలని కోరారు. తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు,అప్పన వెంకటరమణ,ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ఏవో ఉమాదేవి,ఎ సర్పంచులు నత్తూరు సోమన్నదొర, పీటా సింహాచలం, మహిళా విభాగం అధ్యక్షురాలు సావిత్రి, ఎంపీటీసీలు బి.అప్పారావు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటలను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సొసైటీ చైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రయ్య, సత్తిబాబు, ఏవో శ్రీనివాసరావు, సెరికల్చర్ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


కోరాబు అనూషాదేవి

సాక్షి,పాడేరు: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషాదేవి తెలిపారు. తనను మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పదవిలో నియమించిన పార్టీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి ఆమె బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

జీలుగు చెట్టుపై నుంచి పడి గిరిజనుడి మృతి


వెంకటరెడ్డి మృతదేహం

వై.రామవరం: మండలంలోని గురబంద గ్రామానికి చెందిన ఒకదండం వెంకటరెడ్డి(37) అనే గిరిజనుడు జీలుగు చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుని భార్య దేవకుమారి కథనం మేరకు... వెంకటరెడ్డి మంగళవారం రాత్రి తమ గ్రామానికి అనుకున్న కొండపై జీలుగుచెట్టు వద్దకు కల్లు తీసుకురావడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది బుధవారం ఉదయం వెతకడానికి వెళ్లారు. అక్కడ చెట్టు కింద పడి చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయమై అదే రోజు సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అడిషనల్ ఎస్‌ఐ కె. రాంబాబును వివరణ కోరగా, ఫిర్యాదు అందిందని, కేసు దర్యాప్తు చేసున్నామని తెలిపారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈవో మల్లేశ్వరరావు

రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఏ-1 పరీక్షలను ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు.

కాఫీ పండ్ల సేకరణ లక్ష్య సాధనకు కృషి


రోటరీ డ్రైయర్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్


విద్యార్థినుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న పీవో అభిషేక్

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- ఎకో పల్పింగ్ యూనిట్లో రోటరీ డ్రయర్ ప్రారంభం

చింతపల్లి రూరల్: కాఫీ పండ్ల సేకరణకు నిర్దేశించిన లక్ష్య సాధనకు కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక కాఫీ పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఇక్కడ రూ.45 లక్షలతో ఏర్పాటు చేసిన రోటరీ డ్రయర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం వల్ల 24 గంటల్లో పార్చిమెంట్ ఆరిపోతుందన్నారు.మండలాల వారీగా ఏఈవోలకు నిర్దేశించిన విధంగా రైతుల వద్ద నుంచి కాఫీ పండ్లు సేకరించాలని సూచించారు.సకాలంలో రైతులకు చెల్లింపులు జరుగుతున్నందున కాఫీ రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన చింతపల్లి, జీకే వీధ ఏఈవోలపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రైతుల నుంచి 650 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను సేకరించినట్టు పీవో పేర్కొన్నారు.

తాజంగి కస్తూర్బా విద్యాలయం తనిఖీ

తాజంగి కస్తూర్బా విద్యాలయాన్ని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తనిఖీ చేశారు. విద్యార్థినుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్యాంశాలు సక్రమంగా బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎనిమిదో తరగతి విద్యార్థినులు కనీసం చదవడం, రాయడం కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు సొంత పనులకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యార్థినులు పనివాళ్లు కాదన్నారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కాఫీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.అశోక్, మ్యాక్స్ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, ఎంఈవోలు వనపల ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్


విలేకరులతో మాట్లాడుతున్న జేసీ

కొయ్యూరు: ఎటువంటి లోపాలు లేకుండా పక్కాగా ఓటర్ల జాబితాను రూపొందించాలని జేసీ శివ శ్రీనివాస్ ఆదేశించారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి విధిగా తొలగించాలన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి, అసలు ఓటు వేయడానికి రాని వారి పేర్లను కూడా తొలగించాలని సూచించారు. ఓటరు మరణించినట్టుగా బంధువుల నుంచి సమాచారం తీసుకోవాలన్నారు. ఒకే చోట నాలుగైదు పోలింగ్ కేంద్రాలు ఉంటున్నాయని వాటిని సర్దుబాటు చేస్తున్నామని చెప్పారు. వచ్చే నెల 5వ తేదీనాటికి కొత్త ఓటర్ల జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. తహసీల్దారు తిరమలరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

20వేల మంది ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు

రంపచోడవరం : నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసినట్టు సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డోర్ నంబర్ లేని వాటిని చాలా వరకు పరిష్కరించినట్టు చెప్పారు. డబుల్ ఎంట్రీలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 399 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పెంటపాటి అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, టి.బాబూరావు దొర, పి. శ్రీనివాసరావు, డీడీ ఎం.వి.వి. సత్యనారాయణ, డి.ఇందిరా బామ్, మణికంఠ, వాణిశ్రీ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే


వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. రాజేంద్రపాలెంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆమె ఆవిష్కరించారు. సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. రాజేంద్రపాలెం పంచాయతీలో వివిధ పథకాల కింద రూ.11.78 కోట్లను ఖర్చు చేసినట్టు చెప్పారు. 23 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు రూ.230 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

అంతకుముందు కొయ్యూరు చర్చిలో నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. పాస్టర్ల యూనియన్ అధ్యక్షుడు మోసెస్, శరభన్నపాలెంకు చెందిన సీనియర్ పాస్టర్ నాగభూషణం, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, వైస్ ఎంపీపీలు నూకాలు, వెంకటరమణ, సర్పంచ్‌లఫోరం అధ్యక్షుడు ములినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జె.బాబులు, కన్వీనర్ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సూరిబాబు పాల్గొన్నారు.

అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

అడ్డతీగల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, ఆయుధాలను పరిశీలించారు. సీఐ వై.రాంబాబు, ఎస్‌ఐ అప్పలరాజు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అడ్డతీగల పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమకూర్చిన రగ్గులు, రొట్టెలను పలువురు వృద్ధులకు ఏఎస్పీ పంపిణీ చేశారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ జాబితా

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, గ్రూప్ డీ అటెండర్ ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మెరిట్ విధానంలో భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ జాబితాను www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 20వ తేదీలోగా తమ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. పారదర్శకంగా, ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా భర్తీ చేస్తామన్నారు.

మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ఏడీఏ కంకిపాటి సావిత్రి


జడ్డంగి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తూకం పరిశీలిస్తున్న ఏడీఏ సావిత్రి

రాజవొమ్మంగి: రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. మండలంలోని జడ్డంగి ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. తూకం ఏ విధంగా జరుగుతోందో తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అడ్డతీగల సబ్ డివిజన్‌లోని అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం, గంగవరం మండలాల్లో ఆర్బీకేల ద్వారా 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని సూచించారు. ఇప్పటి వరకు జడ్డంగి, గంగవరం ఆర్బీకేల ద్వారా 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, మిల్లులకు తరలించినట్టు చెప్పారు. స్థానిక వ్యవసాయాధికారి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి


మాట్లాడుతున్న మురళి


హుకుంపేట: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఏపీ ఇనిస్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ (రిటైర్డ్ ఐఏఎస్) జె.మురళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని, తమ పరిధి ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

నక్కపల్లి: బీఎస్ హాకీ క్లబ్‌లు, ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు గురువారం నుంచి నక్కపల్లిలో ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల నిర్వహణకు బోదిగల్లం రోడ్డులోని క్రీడా మైదానాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాంబాబు బుధవారం తెలిపారు. బాలబాలికల విభాగాల్లో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. బాలికలకు నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోను, బాలురకు హాకీ మైదానంలోను జరుగుతాయన్నారు.

నేటి నుంచి ఆర్గానిక్ మేళా

- ఏయూ మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహణ
- 161 స్టాళ్లలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం
- ప్రవేశం ఉచితం


వివరాలు వెల్లడిస్తున్న కుమార స్వామి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా గురువారం నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వాహకుడు కుమార స్వామి తెలిపారు. ఏయూ మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్గానిక్ మేళాను గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభిస్తారన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే మేళాలో 161 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, నేరుగా రైతులే తమ పంటలు, ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారన్నారు. మేళాలో భాగంగా 14న ప్రకృతి వ్యవసాయ రైతులతో సదస్సు, 15న గ్రాడ్యుయేట్ ఫార్మర్స్ వార్షిక సదస్సు, 16న ఆర్గానిక్ స్టోర్స్ చాంబర్ మీట్, 17న మిద్దెతోటలు నిర్వహిస్తున్న వారితో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రాంగణంలో ప్రత్యేకంగా సేంద్రియ ఉత్పత్తుల ఫుడ్ స్టాళ్లు, మిద్దె తోటలు, మొక్కల పెంపకంపై ఆసక్తి కలిగిన వారి కోసం నర్సరీ ఉంటాయన్నారు. ఆర్గానిక్ మేళాకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆరోగ్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

గంగవరం : మండల కేంద్రంలో రహదారి పక్కన ఎండిపోయి, ప్రమాదకరంగా ఉన్న చెట్లను గురువారం ఆర్‌అండ్‌బీ, ఫారెస్ట్ అధికారులు తొలగించారు. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతలకు చెట్ల సమస్యను గ్రామస్తులు తెలియజేశారు. వారు సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో అధికారులు స్పందించి వాటిని తొలగించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయ్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు ప్రత్యేక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని లక్ష్య సాధన కోసం పట్టుదలతో చదవాలన్నారు. చదువులతో పాటు ఆటల్లో, పాటల్లో రాణించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అకాక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, థింసా నృత్యాలతో ఆకట్టుకున్నారు.

ఏలేరు, తాండవ అనుసంధానం

భూసేకరణకు రూ.7 కోట్లు

- నిధులు రాగానే ఎత్తిపోతల పనులు ప్రారంభం
- తుపానుకు దెబ్బతిన్న ఏలేరు కాలువ మరమ్మతులు పూర్తి
- నేటి నుంచి ఏలేశ్వరం నుంచి నీటి విడుదల
- ఏలేశ్వరం రిజర్వాయరు ఈఈ భాస్కరరావు


పనులు పరిశీలిస్తున్న ఏలేశ్వరం రిజర్వాయరు ఈఈ భాస్కరావు, డీఈ వినోద్

నాతవరం: ఏలేరు తాండవ ప్రాజెక్టు అనుసంధానం ఎత్తిపోతల పథకానికి రైతుల నుంచి సేకరించిన భూములకు డబ్బులు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏలేశ్వరం ప్రాజెక్టు ఈఈ భాస్కరరావు అన్నారు. మండలంలో ఏలేరు కాలువ 60వ కిలోమీటరు వద్ద మరమ్మతు పనులను బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు జిల్లాల రైతుల నుంచి సేకరించిన భూములకు సుమారుగా రూ.7 కోట్లు అవసరం అవుతుందన్నారు. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఈ నెలలో నిధులు వచ్చిన వెంటనే రైతులకు ఇవ్వవలసిన డబ్బులు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పేరున డిపాజిట్ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఇటీవల సంభవించిన తుపాను సమయంలో ఏలేరు కాలువ 154 కిలోమీటర్ల పొడవున ఎక్కడా గండి పడలేదన్నారు. కొంతమంది భారీ వర్షాలు పడుతున్నాయని భయంతో 60వ కిలోమీటరు వద్ద మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాలువకు గండి కొటేశారన్నారు. ఆ గండిని పూడ్చే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. నిలుపుదల చేసిన కాలువలో నీటిని గురువారం నుంచి విడుదల చేస్తామని, ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశాక విశాఖ చేరుకోవడానికి సుమారుగా 8 నుంచి 10 రోజులు సమయం పడుతుందని చెప్పారు. ఈ వ్యవధిలో అనకాపల్లి విశాఖపట్నం జిల్లాలో ఎక్కడైనా ఏలేరు కాలువకు మరమ్మతులు ఉంటే చేసుకునేందుకు సమయం ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో ప్రాజెక్టుడీఈ వినోద్ జేఈ అప్పలరాజు విస్కో జేఈ నానాజీ పాల్గొన్నారు.

కాంతులీనిన పుష్కరిణి

- భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి
- దీపాలు వదిలేందుకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు, యువతులు
- కార్తీక దామోదరుడికి విశేష పూజలు
- కిక్కిరిసిన వరాహ పుష్కరిణి


పుష్కరిణి వద్ద దీపాలు వెలుగిస్తున్న భక్తులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి బుధవారం పోలిపాడ్యమి శోభను సంతరించుకుంది. కార్తీక మాసానికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే పలు ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు, భక్తులు పెద్ద ఎత్తున పుష్కరిణి వద్దకు తరలివచ్చారు. దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో వాటిని నీటిలో విడిచిపెట్టారు. కార్తీక దామోదరా.. నమో నమః అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించారు. పుష్కరిణి వద్ద ఉన్న రావి, మర్రి చెట్లు, తులసికోట వద్ద దీపారాధన చేశారు. బ్రాహ్మణులకు సాలిగ్రామ దానాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి అంతా కిక్కిరిసింది. అడవివరం మార్కెట్ కూడలి నుంచి పుష్కరిణికి వెళ్లే మార్గమంతా తీవ్ర రద్దీగా మారింది. పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లు, సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచారు. గోపాలపట్నం సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు భక్తుల రద్దీని నియంత్రించారు.

సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం రేపు

పాడేరు రూరల్ : పాడేరు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో పలు సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 15న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం పాటకు హాజరయ్యే వ్యక్తులు తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని, వాపసు చేయబడే రూ.5వేల సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం పాడిన వ్యక్తి అదే రోజు పూర్తి సొమ్మును జీఎస్టీతో సహా చెల్లించి వాహనాలను తీసుకువెళ్లాల్సి ఉంటుందన్నారు.

గిరి గ్రామాలపై చలిపంజా


ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: మండలంలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. మంచుతెరలు ఉదయం 9 గంటల వరకు వీడటం లేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నిదుస్తులు, చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.